క్లుప్తంగా

చురుగ్గా సమిత్వ సర్వే

పాయకరావుపేట: మండలంలో ఆయా గ్రామాల్లో సమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయప్రకాష్ రావు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా శ్రీరాంపురం గ్రామంలో సర్వే నిర్వహించి ఇంటి కొలతలు, హక్కుల పత్రం ఇస్తున్నామన్నారు. గ్రామ కార్యదర్శి వై.వి. సత్యనారాయణ పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్



ఎన్నికల నోటిఫికేషన్ బోర్డులో పెడుతున్న ఎంపీడీవో

పాయకరావుపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ కాపీని పెట్టించారు. ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ సిహెచ్.ఆర్.కె. వర్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలం గణపర్తి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ దళిత వేతనదారులు సోమవారం ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. కాలువలు, గెడ్డలు, చెరువుల్లో ఉపాధి పనులు చేస్తున్నప్పుడు కొందరు అడ్డుకుంటున్నారని వాపోయారు. సెంటు భూమి లేని తమకు పని కల్పించాలని కోరారు. దళిత కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు దళితులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. పిట్ల అప్పారావు, రాజాన బుజ్జిబాబు, కె.గోపాలరావు, వి.రాజు, రవి, నూకరత్నం, సన్యాసమ్మ, అమ్మాజి పాల్గొన్నారు.

గుడి నిర్మాణం పరిశీలన



దొరైస్వామిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక(అచ్యుతాపురం): మునగపాకలో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి గుడి ప్రాశస్త్యం పొందుతుందని బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి అన్నారు. గుడి నిర్మాణ పనుల్ని ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో తీసుకుంటున్న నమూనాలు, నాణ్యత గురించి తెలుసుకున్నారు. స్థానికుల భాగస్వామ్యం గురించి ఆరా తీశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గుడి నిర్మాణానికి విజయవాడకు చెందిన ఆలూరి శారద కుమారుడు శ్రీనివాస్ రూ.50 వేలు ప్రకటించారు. స్థానిక ప్రతినిధులు బొడ్డేడ ప్రసాద్, వెలగా శ్రీను, పెంటకోట ఉమా మహేశ్, ఆడారి లక్ష్మణరావు, ఆడారి రాంబాబు, కిష్టప్ప, కొండకర్ల శివ, ఆడారి కృష్ణ, ఆడారి కాశీ, విల్లూరి నూక నర్సింగరావు, దాడి శివ, కమిటీ సభ్యుడు పీలా వెంకట అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: ఎస్. రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ రేగుపాలెం, యలమంచిలి ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కృష్ణాపురం, లక్కవరం, రుక్మిణీపురం జగనన్న కాలనీ, నాయనమ్మపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అవకాశం ఉన్నచోట తెల్లవారుజాము 2 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఆయా గ్రామల పరిధిలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు.

హోంమంత్రి బాధ్యత వహించాలి...



కృష్ణస్వరూప్

పాయకరావుపేట : పట్టణంలోని అంబేడ్కర్ పార్క్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తలను ధ్వంసం చేసిన ఘటనకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం, రాష్ట్ర హోంమంత్రి బాధ్యత అనిత బాధ్యత వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటన మీద ప్రభుత్వం తక్షణం విచారణ జరిపించాలని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు సందర్శించాలని డిమాండ్ చేశారు. కూటమి పాలనలో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడంలో భాగంగానే అంబేడ్కర్ విగ్రహం మీద దాడి చేసి ధ్వంసం చేశారన్నారు. అంబేడ్కర్ విగ్రహం మీద దాడి అంటే...రాజ్యాంగం మీద దాడేనని తెలిపారు. ఈ ఘటనపై యావత్ పౌర సమాజం, అంబేడ్కర్ వాదులు, ప్రజాస్వామిక వాదులు స్పందించాలని, తీవ్రంగా ఖండించాలని కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు.

యథేచ్ఛగా గ్రావెల్ దందా



పెదకలవలాపల్లి కొండ ప్రాంతంలో పొక్లెయిన్‌తో తవ్వకాలు

- రాంబిల్లి మండలంలో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ పనుల పేరిట అడ్డగోలుగా తరలింపు
- తరిగిపోతున్న ఖనిజ సంపద
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి





పెదకలవలాపల్లిలో గ్రావెల్ కోసం భారీగా తవ్వేసిన కొండ



కొండలదేవునిపాలెంలో గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ పనుల పేరిట గ్రావెల్ తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా తరలిస్తోంది. దాంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినప్పటికీ ఇంతవరకు ఇటు వైపు మైనింగ్ శాఖ కన్నెత్తి చూడకపోగా, రెవెన్యూ అధికారులు మాత్రం పరోక్షంగా సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలో పంచదార్ల వద్ద గ్రీన్ ట్రిబ్యునల్ జోన్ అటవీ శాఖ భూముల వద్ద ప్రభుత్వం నిషేధించిన స్థలాల్లో గ్రావెల్ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ సమీపంలో కొత్తూరు ఎస్సీ కాలనీ వద్ద పురాతన బౌద్ధ స్థూపం, గుప్తనిధులు ఉన్నట్టు గతంలో పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతంలో ఎటువంటి తవ్వకాలను జరపకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అక్కడ సెక్యూరిటీని నియమించారు. ఇప్పుడు అక్కడకు కూతవేటు దూరంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అరికట్టలేకపోతున్నారు. పెదకలవలాపల్లి గ్రామంలో కొండలను స్థానిక నేవల్‌బేస్ ప్రాజెక్ట్ కోసం ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ కొండలను కొంతమంది గ్రావెల్ వ్యాపారులు రేయింబవళ్లు తవ్వేస్తున్నారు. పలు ప్రాంతాలకు తరలిస్తుంటే, మైనింగ్, రెవెన్యూ అధికారులకు, పోలీసులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొండలదేవునిపాలెం, పంచదార్ల, భోగాపురం, మూలజంప, మూలకొత్తూరు వద్ద భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. వీటి వల్ల కొండలు తరిగిపోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిషేధించిన ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తుండటం గమనార్హం.

రెవెన్యూ కనుసన్నల్లోనే తవ్వకాలు..

గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు ప్రశ్నిస్తే, గ్రామాల్లో ప్రభుత్వ పనులకు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నామని గ్రావెల్ మాఫియాకు చెందిన వారు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను అడిగితే అనుమతులు ఇచ్చే అధికారం తమకు లేదని, కొన్ని చోట్ల గ్రామాల నాయకులు సీసీరోడ్లు పేరిట తవ్వకాలు చేస్తున్నారని పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే, సిబ్బందిని పంపిస్తున్నామని చెప్పడమే గానీ వారు రావడం లేదు. పైగా ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన వారి పేర్లను గ్రావెల్ మాఫియాకు చెబుతున్నారని పలువురు వాపోతున్నారు.



కొరవడిన మైనింగ్ అధికారుల పర్యవేక్షణ

రాంబిల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో అధికంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై పలువురు మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ఒక్కసారి రాంబిల్లి మండలంలో పర్యటించలేదు. ఒక్క కేసు నమోదు చేయలేదు.

గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలి



రాంబిల్లి మండలంలో కొండ ప్రాంతాల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రావెల్ తవ్వకాల గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. మైనింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రాంబిల్లిలో ఎక్కడా తనిఖీలు చేపట్టడం లేదు.

– జి. దేముడునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ

పట్టుకుని అప్పగిస్తే చర్యలు లేవు



గ్రావెల్ తవ్వకాలను కొప్పుగొండుపాలెం గ్రామస్తులతో కలసి అడ్డుకున్నాం. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రావెల్ తవ్వకం వాహనాలను అధికారులకు అప్పగిస్తే, వాటిపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు. మరలా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి.

– బద్ది హరిబాబు, గ్రామ సర్పంచ్

ప్రభుత్వాదాయానికి గండి



గ్రావెల్ తవ్వకాలు వల్ల ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. గ్రావెల్ తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతున్నా, అధికారులు ఒక్క వాహనం పట్టుకోవడం లేదు.

– చింతకాయల శివాజీ, జిల్లా అధ్యక్షుడు, డీవైఎఫ్

గ్రావెల్ తవ్వకంపై చర్యలు

రాంబిల్లి మండలంలో గ్రావెల్ తవ్వకాలకు తాము ఎక్కడ అనుమతులు ఇవ్వలేదు. గ్రావెల్‌కు అనుమతులు గనుల శాఖ దగ్గర తీసుకోవాలి. గ్రావెల్ తవ్వకంపై వచ్చిన ఫిర్యాదులుపై చర్యలు తీసుకుంటున్నాం.

శ్రీనివాసరావు, తహసీల్దారు, రాంబిల్లి

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు రేపు



ఫీజు పోరు కరపత్రం ఆవిష్కరిస్తున్న కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం అమ్మఒడి, ఫీజు రీయింబర్సుమెంటు పథకాలు అటకెక్కించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న చేపట్టబోయే ఫీజు పోరు నిరసన కరపత్రాన్ని సోమవారం ఆయన అడ్డు రోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద విడుదల చేశారు. పార్టీ పిలుపు మేరకు చేపట్టబోయే కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని విమర్శించారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో అన్నదాత సుఖీభవ పథకం నిధులు ఇవ్వకుండా నిలువునా ముంచేసిందని ధ్వజమెత్తారు. మహిళలకు ఎనిమిది నెలలుగా ఒక్క పథకం ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించలేక కళాశాల యాజమన్యాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, శీరం నరసింహామూర్తి, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, తిమ్మాపురం, గుడివాడ సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనివాసరావు, బీసీ సెల్ నాయకుడు లొడగల చంద్రరావు, నాయకులు మధువర్మ, మందగుదుల వెంకటరమణ, గెంజి వెంకటరమణ, పొలుమూరి అప్పలరాజు, కొమ్ము జగదీష్, వై తాతారావు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో బోర్డుల ఏర్పాటుకు ఆదేశం

పాయకరావుపేట: పట్టణంలో పంచాయతీకి సంబంధించిన లే అవుట్‌ల్లో కమ్యూనిటీ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సమిత్వ సర్వే సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని, గ్రామంలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శివరాం, సిబ్బంది చిన్నారావు, కుమారస్వామి పాల్గొన్నారు.

వేపనూనెతో చీడపీడల నివారణ

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి గ్రామంలో రైతు వనరుల కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం క్షేత్రస్థాయిలో సందర్శించి అపరాల పంటలు పరిశీలించారు. ఎన్.పి.ఎస్.ఎస్‌పై రైతులకు అవగాహన కల్పించారు. స్మార్టు ఫోన్ ఉన్న రైతులు ఎన్.పి.ఎస్.ఎస్. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వారి పొలంలో చీడపీడలను తెలుసుకోవచ్చన్నారు. వాటి నివారణకు వేపనూనె 5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏవో పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఈ – కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. కలుపు నివారణకు ఇమేజిత పైరా 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట ఏడీఏ కె.ఉమాప్రసాద్, రైతు వనరుల కేంద్రం ఏవో తులసి, ఏఈవో జ్యోత్స్న, వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు



ధర్మవరం గ్రామంలో విద్యార్థుల స్టడీని పరిశీలిస్తున్న దృశ్యం

నక్కపల్లి/ ఎస్.రాయవరం: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. సోమవారం ఆయన నక్కపల్లి మండలం వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోజూ స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రణాళికలు రూపొందించి విద్యార్థులు వాటిని పాటిస్తూ ప్రిపేరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారనే విషయాలు ఆరా తీయాలన్నారు. ఎస్. రాయవరం మండలం పెనుగొల్లు, ధర్మవరం గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి స్టడీ అవర్స్ పరిశీలించారు. ఎంఈవో కుంచం నరేష్, హెచ్‌ఎంలు మూర్తిరాజు, బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మీనాప్రకాష్ పాల్గొన్నారు.

అక్షరాస్యులను పెంచడమే లక్ష్యం



కోటవురట్ల: ఉల్లాస్ శిక్షణ పుస్తకాలను ప్రదర్శిస్తున్న వలంటీర్లు

నక్కపల్లి: గ్రామాల్లో అక్షరాస్యత పెంచడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు, వెలుగు ఏపీవో శ్రీనివాస్ కోరారు. సోమవారం డ్వాక్రా మహిళలు, ఎంపిక చేసిన స్వచ్ఛంద వలంటీర్లు, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి వలంటీరు 20 మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసుకుని వారికి చదువు నేర్పించాలన్నారు. సమావేశానికి వచ్చిన వలంటీర్లకు అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అక్షర వెలుగు మార్గదర్శి వంటి పుస్తకాలను అందజేశారు.

కోటవురట్ల: ఉల్లాస్ కార్యక్రమంతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో వలంటీర్లకు వయోజన విద్యపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా ఆయాలు, వాచ్‌మెన్లు, సంఘ సభ్యులను అక్షరాస్యులుగా తయారు చేయాలన్నారు. సంక్షిప్త వాచకం, మార్గదర్శిని పుస్తకాలను అందజేశారు.

చదువుల తల్లీ విద్యాబుద్ధులు ఇవ్వమ్మా..



కె.వెంకటాపురంలో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

కోటవురట్ల: వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతీ దేవి ఆలయాలలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేశారు. కె.వెంకటాపురంలోని రఘురామ్ కాన్వెంట్‌లో పిల్లలతో అక్షరాభ్యాసాలు, హోమాలు చేయించారు. అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ పచ్చార నానాజీ పాల్గొన్నారు.

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలం వాడ్రాపల్లి పెద్ద రామాలయంలో సరస్వతీ దేవి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సరస్వతి దేవి దయ ఉంటే అందరికీ విద్యా బుద్ధులు, వికాసం లభిస్తుందని తెలిపారు. పెతకంశెట్టి జోగినాయుడు, ఎస్.జగన్నాథరావు, దాడి గణేశ్, పి.లీలా భాస్కర్, కాండ్రేగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్. రాయవరం ఎంఈవో -2గా స్వప్నప్రియారెడ్డి



ఎంఈవో -2ని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: లింగరాజుపాలెం హెచ్‌ఎం స్వప్నప్రియారెడ్డి సోమవారం ఎంఈవో -2గా బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు మండల విద్యా శాఖ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంఈవో కార్యాలయంలో అమర్చేందుకు శాస్త్రవేతలు ఏపీజే అబ్దుల్‌కలాం, గణిత పితామహుడు రామానుజన్ చిత్రపటాలను ఏపీటీఎఫ్ ద్వారా మాజీ ఎంఈవో బి.కాశీవిశ్వనాథం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు

రాంబిల్లి మండలంలో 8 మందిపై నమోదు

రాంబిల్లి (యలమంచిలి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాంబిల్లి సీఐ సీహెచ్ నరసింగరావు సోమవారం ఒక ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాంబిల్లి మండలంలో పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారి గురించి సమాచారం ఇవ్వాలన్నారు.

ధర్మశ్రీని కలిసిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు



కరణం ధర్మశ్రీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అచ్యుతాపురం: అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన కరణం ధర్మశ్రీని యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ నేతలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ధర్మశ్రీని సత్కరించారు. ధర్మశ్రీ నియామకం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అచ్యుతాపురం మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, పిన్నమరాజు వాసు, సతీశ్, వెంకటేశ్వరరావు, మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ, ఆడారి అచ్చింనాయుడు, కొల్లి అప్పారావు, బొగడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

'బ్రాండిక్స్ కార్మికులకు వేతనాలు పెంచాలి'



నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్: బ్రాండిక్స్ కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ సోమవారం అచ్యుతాపురం సెంటర్‌లో సీఐటీయూ నాయకులు నిరసన తెలియజేశారు. రాము మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కటింగ్స్ పోయి రూ.15 వేలు వేతనం ఇవ్వాలని ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులకు అండగా నిలిచిన సీఐటీయూ నాయకుల అక్రమ అరెస్టులు, నిర్బంధ చర్యలు ఆపాలన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి పూడిమడక మత్స్యకార సంఘం నాయకుడు చాపల తాతయ్యను పోలీస్ స్టేషన్‌కు తరలించి భయానక వాతావరణం సృష్టించారన్నారు. యాజమాన్యాలకు కొమ్ము కాసే పద్ధతులను మానుకోపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గార్మెంట్స్ వర్కర్ల జీతాలకు సంబంధించిన జీవో సవరించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించి అమలు చేయించాలన్నారు. సమస్యలు పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో చేపడుతున్న మహిళా కార్మికులపై కఠినంగా వ్యవహరించడం ప్రభుత్వానికి, యాజమాన్యానికి తగదన్నారు. చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, ఆర్ లక్ష్మీ, దూలి వెంకయ్య నాయుడు, ఒడిసెల శ్యాము తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు హైవేపై సీసీ నిఘా

ధర్మవరం నుంచి పాయకరావుపేట వరకు కెమెరాల ఏర్పాటు



నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న సీఐ కుమార స్వామి

నక్కపల్లి: జాతీయ రహదారిపై రోడు ప్రమాదాలు, గంజాయి అక్రమ రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా పోలీసులు పలు ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటు పనులను సోమవారం నక్కపల్లి సీఐ కుమార స్వామి పరిశీలించారు. పాయకరావుపేటలో 35 కిలోమీటర్ల దూరం కలిగిన జాతీయ రహదారి ఉంది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్. రాయవరం సర్కిళ్ల పరిధిలోకి వచ్చే హైవేపై నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి కారణమైన వాహనాలు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. అనుమానాస్పద వాహనాలను నిలిపి తనిఖీ చేసే క్రమంలో అవి ఉడాయిస్తున్నాయి. నక్కపల్లిలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు చోరీకి గురవుతున్నాయి. వీటిని గుర్తించాలంటే వేంపాడు టోల్‌ప్లాజా వద్దకు లేదా ఎలమంచిలి సమీపంలో కొక్కిరాపల్లి వద్ద ఎన్‌హెచ్16 వారి కార్యాలయాలకు వెళ్లి పరిశీలించాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.